ఊరంతా కనుగొన్నారు ఆ వింతను యతివింతగా మహా వింతగా! ఊరంతా గాలించారు ఆకోయదొరకోసం— "మాకెప్పుడు స్వరాజ్యమే!" అన్నవాని యూసుయొక్క ఎదిరియులివు తప్పిస్తే, మఱి దాని యజాలేదు పజాలేదు ఎటు చూచినా ఎంతవెదకినా!

కోయదొర యంతచేటు మటుమాయమై చన్నాగానీ, "యువతిది తప్పా? ముత్తవ్వదితప్పా?" అని చెట్టుక్రింద విచారణమాత్రం ఆ హరిజనవాడలో ఇప్పటికీతప్పలే! తాటిచెట్టు ఆకులు టపటప కొట్టుకోడం మానలే!

....

సముద్రమ్మీద పెద్దనీడ

"ఓడకంటె ఘనమైనదిగా దోచెన్
నీడ! ఆ నీడ! నీటిమీద నీడ!
మున్నీటిమీద నీడ?—
నా నీడ కాదు చూడ,
నీ నీడ కాదుకూడ
మేడ నీడ కాదు,
చేదె నీడ కాదు,
మేడమీద చేదెదేమొ?
కాదు! కాదు!"

ఇలాగ్గా తలపోస్తూ దిక్కులన్నీ కలయజూచాను. తుద కాకాశ మ్మీద కానగల్గాను. కాదంబినీమాల నొకదాన్ని. మేఘం పట్నం మీద నుంది. నీడ సముద్రంమీద నుంది. నీడపట్టు, మేఘంపట్టు తప్పిస్తే, మిగతా ఆకాశంమిగతా అవని సమస్తం సవితృతేజాన్ని విరాజిల్లుతూన్నాయి.

సముద్రంమీద నౌకానౌక మహత్తరమైన దృశ్యంగా ఆ నీడను, ఆకాశమ్మీద నౌకానౌక మహత్తరమైన దృశ్యంగా ఆ మేఘాన్ని, పరిగణిస్తూ, తీరాన్నే నిలుచుండిపోయాను కొన్ని నిమిషాలు ఒక ప్రొద్దున్నప్పుడు. అలలమీద ఆ ఛాయ అవతరించి ఈదులాడుతూన్నట్టుంది. దానికో ప్రత్యేకత, పరమావధి ఉన్నట్టగపించింది. పరిబంధన మేమాత్రంకూడా లేనట్టుగా పొడగట్టింది. మేఘమేమన్నా పట్నంమీద నుంది. నీడేమన్నా మహా సముద్రంమీద నడాడుతూవుంది. నీడను నడిపించేది ఆ మేఘము కాదేమో అన్నంత స్వేచ్ఛగా అల్లలాడిపోతూవుంది ఆ నీడ! ఆ మేఘం ఒకవేళ వర్షించినా వానచినుకులన్నీ పట్నంమీదనే పడతాయిగాని ఆ నీడను లాగిపట్టి, అరికట్టబోవు! ఆ నీడ మఱో మేఘానిదేమో అని యనుకోడానికి ఆకాశమ్మీద మఱో మేఘమే లేదు ఆ వొక్క మేఘాన్ని తప్పిస్తే. పోనీ మఱో పదార్థానిదేమో అంటే, పక్షి అన్నా ఎగరడంలేదు, పయోధిమీదగాని, వీధిగుండాగాని, మేఘంయొక్క ప్రకృతిని తప్పిస్తే ఆ నీడయొక్క ప్రాదుర్భావానికి మఱో హేతువు కానరాకుండా వుంది. ఆ నీడే వాలకపోతే సముద్రము నా కెంత అయోమయంగా కాపడియుండేదో నా దృష్టికి. అదో వ్రాత, అదో తెలుపుడు. అని అనజేసింది నాచేత!

"ఏంటుంది చూస్తున్నారు విడ్డూరంగా! నీటి మీద?" అని ఎటకరించినట్టడిగింది దారేపోయే ఒక మిటారి మిన్న. "ఏం లేదు నీడ వల విసిరేను" అన్నాను. "నీడ వల అహహ!" అని నవ్వింది. ఆ నవ్వులో ఆమె నఖశిఖపర్యంతం చూచాను. నల్లని యొడళ్ళు, నవకమెఱిగిన కళ్ళు, చవగ్గా

అప్పుడే కొన్న కూరదాక, దాకలో గుప్పెడు నీరుల్లిపాయలు, అదీ సంతనుండి తిరిగివచ్చే పెడికీల నెరజాణగా తోచింది.

"అదేంటుండి! నావంక అంత విడ్డూరంగా చూస్తు న్నారు?" అని అడిగింది. "నీ వొళ్ళు నీ కళ్ళు" అని జారు డిలా సూటిగా జవాబు చెప్పాను. "నా వొళ్ళు నాకళ్ళు? మీ కంటి కెలా కనిపిస్తున్నాయి ఏంటి?" అని రెచ్చిపోతూ అడిగింది.

నేను మాత్రం మఱి సరాగం ముదరనీక ఆధ్యాత్మంలో పడిపోతూ, "నీ ఆత్మ నవ్వీన వెలుగునే నిలువునా నీవు. నీ ఆత్మయొక్క నీడలా కనిపిస్తున్నావు, అమ్మ! తెలిసిందా?" అన్నాను. మరెక్కడో నీడల రాయళ్ళల్లే కాపడుతున్నారు— నాకిప్పుడు ఆకలి తప్పిస్తే మఱొకటి లేదు. మీరేంటో ఆత్మ అంటారు. ఈ దాకలో పోపేసుకునేదాకా నాకు మఱొకటి తోచదు. మీకన్నీ విడ్డూరాలే తోస్తాయి" అంటూ చక్కా పోయింది ఆ జవ్వని.

మేఘం నవనీతంలా కరిగిపోతూ మాయమైంది. ఎండ విప్పారింది. ఎటుచూచిన ఎండే. నడక తప్పిన కొండమీదా ఎండే. నడుస్తూవున్న ఓడ కొయ్యనూ ఎండే! ఎండలో సమస్తం అతి విస్పష్టంగా, నీటిమీద వస్తువులు, నీటివోరే జరిగే వృత్తాంతాలు, నిడివిగా ఎదిగి నిలబడ్డట్టు కనబడే నగర హర్మ్యోపరి నందగించే కాంతలయొక్క కుటిలకుంతలాలు అన్నీ అతి స్పష్టంగా వెల్లడిపడి తెల్లమౌతూవున్నాయి.

పల్లె జవ్వని ఏమన్నా నన్ను వదలి వెళ్ళిందై అంత దూరాన్ని ఆ తీరమందే నిలుచుండి తన చేతిలోని కొత్తగా

కొనుక్కున్న కూరదాకను వారాసిమీదకు నే చూస్తూవుండగానే గిరాటేసింది. గబగబా పరుగెత్తుకుని వెళ్ళి "ఏం పని అది? నిక్షేపంవంటి కూరదాకను కొనుక్కున్నదానివి. కూర పోపెట్టుకోవాలని ఉబలాటపడ్డదానివి, అలా ఎందుకు గిరాటేసినావు?" యని అడుగుదామని యనుకున్నాను: కాని దాని ముదలకింపు స్వభావం యదివఱకే ఎరిగున్న కారణంగా, అటు చనక, ఆ తేల్తూ మునుగుతూ ఒడ్డును తాకుతూ, తిరిగి నీటిలోపలకు దాకుడుండి పోతూవున్న దాక దృశ్యాన్ని మట్టుకే పరికిస్తూ ఉండిపోయాను.

అంతట్లోనే యటువెంపునుంచి షికారుగా కాలినడకను వస్తూవున్న ఒక నవనాగరికపు జవరాలు నన్ను తనకుతానే ఎఱుకపఱచుకునే మెలికచూపులతో తొ_త్త చూచిందై, వెంటనే పలకరిస్తూ "ఆమె ఆ దాకను అలా ఎందుకు విసిరిందో మీరు గ్రహించారా?" యని అడిగింది. అదివఱకూ లోకానికి నేను మిక్కిలీ లాతివాణ్ణేమో యని యనుకొన్నంత వింతగా నిల్చున్నవాణ్ణేని, ఆమె పలుకరింపుతో భూలోకవాసినై భూలోకవాసినే కాకుండా వర్తమానయుగమునందలి వాసిగానే నన్ను నేను భావించుకుంటూ—"నమస్తే! మీరేమైనా గ్రహించివుంటే ఈ దాసుడు వినగోరుతున్నాడు" అన్నాను. "నా మేధాశక్తి యంతటిది కాదు కనుకనే తమర్ని యడగడం జరిగింది" అంది. "అవితే ఇద్దఱం ఒక మట్టాన్నే యున్నాము, ఆసీనులమై కొంతసేపు పరకాయించి చూదాం! ఇద్దటి బుద్ధిలూ కలిపి ఆలోచిస్తే ఏమైనా ఆ పల్లె జవ్వని యుల్లం తెలియవస్తుందేమో" అన్నాను "పోనీ! ఒకడుగు అలా వెళ్ళి ఆమెను కనుక్కొని రాకూడదూ

మనమిద్దఱం !" అంది తెనుగుమీఱి కన్పడుతూయున్న అమ్మ ద్దియ. "ఆలాగే చేయవచ్చును" యంటూ ఆమె ముందూ నేను వెనక కొంతదవ్వు, ఇద్దఱం ఒకళ్ళ ప్రక్క నొకళ్ళం కొంత దవ్వు, నేను ముందూ ఆమె వెనుకా కొంతదవ్వు, ఈలా పదడుగులనుకోండి లేక పాతికడుగులనుకోండి, యటువంటప్పుడు దూరం నేరడం కష్టం—కలిసీ నడిచాం, కలియకా నడిచాం !

అంతలో పల్లెజవ్వని తిరోహిత అయింది, పారంమీద లేనేలేదు. నీరంమీదనూ లేదు. నీరంమీద మాత్రం దాక వొక్కటే నల్లని జుత్తు పుట్టలా ఎగిసెగిసి పడుతూవుంది.

తీరాన్నివున్న ఇద్దఱమూ ఈ చదువుకున్న వాళ్ళం, ఒకళ్ళ వంక నొకళ్ళం తెలియని చూపులు కొంతసేపు. తెలిసీ తెలియని చూపులు కొంతసేపూ, చూచుకున్నవాళ్ళమై—"ఆమె మత్స్యగంధిలా మాయమైందే" అని ఒకళ్ళం అంటే "అట్లా యవితే యోజనగంధియై యీ చుట్టు ప్రక్కల్నే ఉందేమో" అని మఱొకళ్ళం !—ఏలాగవుతేం చివరకు పర్యవసానం ఒక్కటే! దశదిశలూ కలియచూచాం, నరుల సంచారం లేదు. అమరుల సంచారం లేదు. ఎండమాత్రం తీవ్రతరం అయిపోతూవుంది. నాకూడా ఉన్న నాగరీకాంగన నుదుటిమీద యప్పుడే చిఱు చెమ్మటలు క్రమ్ముతూ వున్నాయి.

"మనం ఇటూ యటూ చూడ్డంలో ఆ పల్లెది తానుకూడా సముద్రంలో పడిపోయివుంటుంది" యని అన్నాను నేను గద్గదికంగా, "ఆత్మహత్య చేసికొనే స్వభావంగలదానిగా నాకు తోచలేదు దాని వైఖరి చూస్తే ! ఆట్లాడుకునే ఆమాయకు రాలిగా దోచిందిగాని" అంది ఆ నాకూడా ఉన్న ఆమె

"లోకంలో చావు ఆట కాకూడదా ?" అన్నాను నేను, అభిజ్ఞ నిరుత్తరగా నిలుచుండిపోయి. వొడ్డుకు కొట్టుకొస్తూవున్న దాక నింకా కంటూవుంది——

దాకనట్టే తన గాజుల చేత్తో ఎత్తిపట్టుకొన్నదై పల్లె యిల్లాలు—అమ్మయ్యో ఖూతంలా, బూచిలా, తల విడిపోయి, మొల తడిసి, జిల జిలా పయికి నడచివచ్చింది.

ఆమెను వెంటనే ఈమె పలుకరిస్తూ "అంత తెగువ సెల్లునటే ?" యని అడిగింది, "తెగువేంటి ? ఆయనగారు నీడ విసిరి ఆడేరు గందా యని నేను దాక విసిరిచూచాను, మఱి విసిరినాక దాకెక్కడ పగిలిపోతుందో యని నేనే దూకాను. అంతే !" అంది పల్లెది జవాబుగా. "దాక గట్టిగా ఉందా ? నా నీడ గట్టిగా ఉందా ?" యని అడిగాను నేను. "మీ నీడ మఱి కానరాలేదు నాకు, కాని నా దాక అమ్మట్టునే ఉంది. ఇదుగో ! ఇదెందుకు పగుల్తుంది ? ముమ్మారు నడివేలి కణుపుతో మోగించి మఱి చూచి కొనుక్కొన్నాను. నా దాకెన్నటికీ పగలదు. ఇఖసలే పగలదు. చూచారుగాదూ మీరిద్దఱూ యది నీట దేలి ఇసకనేసుకు కొట్టుకోవడం ?" యంది అత్యాశ్చర్యపోతూ ఆ జాలారివనిత. అంటూ వెళ్ళిపోతూంది. "బతికింది అది మన కళ్ళముందు చావకుండాను" యని బిగ్గరగా అనుకొన్నాము దగ్గఱగా చేరుకుంటూ అక్కడ నున్న తక్కిన యిద్దఱమూను.

ఆ మాటలో వెనక్కి తిరిగిచూచిందై ఆ పల్లెజవ్వని "ఆయుర్దాయము దేవుడిచ్చినంత కాలం ఉండక తప్పదు మనకూ మన దాకలకూ !" యంటూ మహాసముద్రంవంకకు

చూస్తూ " మేఘూంది కాబోసు మీరు చూచిన నీడ, మీరు విసిరిందన్నారు! విసిరిన వల అన్నారు! నన్ను మోసపుచ్చారు! మాం మేఘాల్లో మెఱపులే చూచాం కాని మేఘాలుపఱచే నీడలు ఎరుగబోం!" అంది తెల్లబగా! "మెఱపులు ముందునీడలు?" అంది నాగరీకురాలు తన ఎఱ్ఱటి పెదవులు నా వెంపుకు త్రిప్పుతూ, "మేమే! మనమే! నా నల్లటియొళ్ళు చీకట్లో కానలేడు నా మొగుడు. మెఱపులో జిగాల్‌మంటానంట!" అంది చిరునవ్వు నవ్వుతూ ఆ జానపదస్త్రీ, చిరునవ్వుతోనే తన పల్లెను చేరుకుంది ఆమె—

మే మిద్దఱం, మిగిలిపోయిన నవనాగరీకుల మిద్దఱం చెరోవైపుకు

"నా కళ్ళ మెఱపులో - నీవేను నీడవు!"

అని యనుకొంటూ వెనుచూపులు చూచుకుంటూ విడిపోయాము.

....

మాయగాక మరేమిటది?

పాలకు ధర పెరిగింది. ఆ రోజుల్లోనే ఆలకూ ధర పెరిగింది. అందఱూ కాఫీ ఇత్యాది పానీయాలు పీకమొయ్యా త్రాగడంవల్ల ఎక్కడ ఉన్నపాలు ఆటీవికావు. ఎంతధర పడితే యంత ధరాపెట్టి కొనుక్కుపొయ్యేవారు మఱి మిలిటరీ వాండ్లకు ఆహారసరఫరాగా ఏ మాంసం పడితే ఆ మాంసమే సంగ్రహింపబడుతూవచ్చేదేమో, గోమాంసంకుకూడా విలవ పెరిగిపోయింది.